క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్షప్యాడ్ల పంపిణీ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, తిరుమలగిరిలోని కేజీబీవీ విద్యార్థులకు బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందించారు. జెడ్పీహైస్కూల్ హెచ్ఎం నిర్మలాకుమారి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి, రవి, సురేష్, ఉపాధ్యాయులు సమత, శ్రీదేవి, రజిత, సోమయ్య, సుజాత, రవి, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

నడికూడ : పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని వరికోల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరికోల్ గ్రామానికి చెందిన ఏసిరెడ్డి సమ్మక్క (55) కొన్ని రోజుల నుంచి ఆస్తమాతో బాధపడుతుంది. ఈ క్రమంలో మనోవేదనకు గురైన ఆమె బుధవారం ఉదయం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రషర్లతో ఇబ్బందులు

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు సమీపంలో గల సాయిరాం, వాసుదేవ క్రషర్ల కారణంగా తమ వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని , భూముల్లో రాళ్లు పడుతున్నాయని మండంలోని మల్కపేటకు చెందిన రైతు యాట సంపత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపాడు. గతంలో అధికారులకు వినతిపత్రం అందించినప్పటికీ ఫలితం లేదని వాపోయాడు. తమకు నష్టపరిహారం అందించడంలో క్రషర్ యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నాడు.

గుంతల పూడ్చివేత



వేలేరు : మండలంలోని పీచర గాంధీ విగ్రహం నుంచి శాలపల్లికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలను గ్రామానికి చెందిన వెంకటశ్రీ స్టోన్ క్రషర్ యాజమాన్యం బుధవారం పూడ్చివేసింది. క్రషర్ ప్రతినిధి రవికిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్లపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు.

జీఓ 29 రద్దు చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని గ్రూప్ -1 నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే జీఓ నంబర్ 29ను రద్దుచేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో లైబ్రరీ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ భేషజాలకు పోకుండా గ్రూప్ -1 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు అభ్యర్థులతో తక్షణమే చర్చలు జరపాలని కోరారు. జీఓ నంబర్ 55ను పునరుద్ధరించాలని సూచించారు. అశోక్, నరేష్, చరణ్, వీరన్న, సూర్య, స్వాతి, పృథ్వీరాజ్, సంగీత, అనూషతో పాటు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పెండింగ్ డీఏలు చెల్లించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలను చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలలను టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులతో కలిసి బుధవారం సందర్శించి ఓటరు నమోదుపై ప్రచారం చేశారు. ఉపాధాయులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను పంపిణీచేశారు. టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు, ఉపాధ్యక్షురాలు జ్యోతి, హెచ్ఎంలు భాస్కర్‌రెడ్డి, రమాదేవితో పాటు పాల్గొన్నారు.

డీఎండబ్ల్యూఓగా మురళీధర్‌రెడ్డి?

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి (డీఎండబ్ల్యూఓ)గా డి.మురళీధర్‌రెడ్డిని నియమించనున్నట్లు సమాచారం. నేడోరేపో ఈ నియామకంపై అధికారికంగా ఉత్తర్వులు రానున్నట్లు తెలిసింది. మురళీధర్‌రెడ్డి ప్రస్తుతం సెరీకల్చర్ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు.

రైతులు రాక.. సరుకులు లేక

- చిన్నబోతున్న వ్యవసాయ మార్కెట్
- కరువైన ఉపాధి.. ఆలోచనలో హమాలీలు
- త్వరలో ఆందోళన బాటకు సిద్ధం
- నూతన పాలకవర్గంపైనే ఆశలు



పరకాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్

పరకాల : ఒకప్పుడు అన్ని రకాల సరుకులు అందుబాటులో ఉండి కలకలలాడే పరకాల వ్యవసాయ మార్కెట్ ప్రస్తుతం ప్రైవేటు జిన్నింగ్ మిల్లుల కారణంగా కొనుగోళ్లు లేక నేడు వెలవెలబోతుంది. మార్కెట్ ఆదాయం తగ్గుముఖం పట్టడంతో మార్కెట్‌పై ఆధారపడిన వందలాది మంది హమాలీ కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఆసన్నమైంది. రైతులను నిలువు దోపిడి చేసే ప్రైవేటు మిల్లులను స్వయంగా ప్రభుత్వం ప్రోత్సహించడం వలనే వ్యవసాయ మార్కెట్‌ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు విమర్శిస్తున్నారు. వాస్తవానికి వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ తర్వాత అనేక గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి ఆదాయం, 300 మందికిపైగా కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పరకాల మార్కెట్ రెండో స్థానంలో ఉండేది. అలాంటి మార్కెట్ నేడు జిన్నింగ్ మిల్లుల కారణంగా మార్కెట్‌కు చేరుకోవాల్సిన సరుకులు రాకపోవడంతో చిన్నబోతుంది. రోజుకు కనీసం రూ.100 కూలీ దొరకటం లేదని హమాలీలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిన్నింగ్ మిల్లుల్లో చిన్నచిన్న వాహనాల్లో వచ్చే పత్తి బస్తాలు కొనుగోలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కొందరు మిల్లర్లు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు నగదు చెల్లింపులు వేగవంతంగా చెల్లిస్తూనే మరోవైపు కాంటాల్లో దోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు అక్రమ కాంటాలు పెరిగిపోయినా మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



ఆవరణలో సీసీ లేకుండా నిర్మించిన గోదాం

సీసీఐ నై.. జిన్నింగ్ మిల్లుకు సై

రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందించాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు సైతం జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేయడంతో వ్యవసాయ మార్కెట్ కల తప్పిందని పలువురు ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వమే సీసీఐ కొనుగోళ్లు కేంద్రాలను జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసేందుకు అనుమతించిందని ఆరోపిస్తున్నారు. రైతులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా వందలాది మంది కార్మికుల పొట్టగొట్టినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని స్థానిక హమాలీ కార్మిక సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదాంలకు జాడలేని సీసీరోడ్లు

పరకాల వ్యవసాయ మార్కెట్‌లో 5వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించగా గోదాం చుట్టూ సీసీరోడ్డు వేయకపోవడం వలన భారీ వాహనాలు (లారీలు) దిగబడిపోతున్నాయి. దీంతో గోదాంలకు ధాన్యం తీసుకరావడం, తీసుకెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త పాలకవర్గంపైనే ఆశలు

ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలలో వెనుకబడిన వ్యవసాయ మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నూతన పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రైతులు, హమాలీలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

200 మందితో ధర్నా నిర్వహిస్తాం



ఎంతో మంది కన్నతల్లిలా ఆదరిస్తున్న పరకాల వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి చేయాల్సి ఉండగా.. అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వ్యవహరిండం సరికాదు. నవంబర్ 15 వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే 200 మంది కార్మికులతో ఆందోళన చేపడుతాం.

- లంకదాసరి అశోక్, పరకాల

ప్రజల శ్రేయస్సే పోలీస్ లక్ష్యం : ఎస్సై



ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఎస్సై సురేష్

వేలేరు : ప్రజల శ్రేయస్సు కోసమే పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని ఎస్సై సురేష్ స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్‌లు పనిచేస్తున్నారని అన్నారు. విధి నిర్వాహణలో ప్రాణాలర్పించిన పోలీస్‌ల సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం వేలేరు హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నిర్వహణ, నేరాల నియంత్రణ, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే విధులు, డయల్ 100, షీ టీమ్, సైబర్ నేరాలు, ఆయుధాల పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజన్న, హెడ్ కానిస్టేబుల్ సుందర్‌రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జెడ్పీసీఈఓ విద్యాలత



భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ విద్యాలత

ధర్మసాగర్ : విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పీసీఈఓ విద్యాలత సూచించారు. మండలంలోని ముప్పారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినుల హెల్త్ కార్డులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా తాగునీటి సదుపాయాలను, ఆర్‌ఓ ప్లాంటు పనులను, పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం నారాయణగిరి గ్రామంలో గల జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంఈఓ రాంధన్, పంచాయతీ కార్యదర్శి సురేష్, కస్తూర్బా ఇన్‌చార్జ్ ఎస్‌ఓ సువర్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న భిక్షపతి మాదిగ

కమలాపూర్ : ఈనెల 26న హనుమకొండలో నిర్వహించతలపెట్టిన మాదిగల ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతిమాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణి వీడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని అమలు చేయకుండా మాదిగ జాతిని వంచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మరో పోరాటానికి మాదిగ జాతి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్‌మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినేష్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు సుకుమార్‌మాదిగ, జిల్లా ప్రధానకార్యదర్శి రాజు, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, మండల అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా, మండల నాయకులు రవీందర్, ప్రభాకర్, సుధాకర్, భూమయ్య, కుమారస్వామి, కుమార్, స్వామి, ప్రశాంత్ పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : ఈనెల 26వ తేదీన వరంగల్‌లో జరిగే ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రాజయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎమ్మార్పీస్ నాయకులు శంకర్, అశోక్, మురళి, రవి, కొమురయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి

సీఐ పులి రమేశ్



ఎల్కతుర్తి : దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించేందుకు ఏర్పాటు చేసే బాణసంచా దుకాణదారులు అనుమతి తీసుకోవాలని సీఐ పులి రమేశ్ సూచించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి, వంగర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసే బాణసంచా దుకాణదారులు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయొద్దని, ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా దుకాణాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. దుకాణానికి ముందు వాటర్ డ్రమ్ములు, ఇసుకతో కూడిన బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతులు లేకుండా షాపులు నెలకొల్పితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కిరాణా షాపుల్లో టపాసుల విక్రయించొద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి, ఫైర్ అధికారుల అనుమతి, షాపు ఏర్పాటు చేసే స్థలం యజమాని అనుమతి, బ్యాంకులో చలానా, సమీప పోలీస్‌స్టేషన్ అధికారి ధ్రువీకరణ పత్రాలను జతచేసి షాపు నిర్వాహకులు అనుమతి పొందాలని ఆయన అన్నారు.

బెల్ట్‌షాపులు మూసివేయాలి



పరకాల : మండల వ్యాప్తంగా విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులను ఎక్సైజ్ అధికారులు వెంటనే మూసివేయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.తిరుపతి డిమాండ్ చేశారు. మద్యం షాపుల యాజమానులు సిండికేట్‌గా మారి పేరున్నా బ్రాండ్లను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని అన్నారు. అలాంటి బ్రాండ్లను బెల్ట్‌షాపులకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. పరకాల ఎక్సైజ్ శాఖ పరిధిలో గల బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సీపీఎం పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కల్యాణ్, ప్రశాంత్, ప్రవీణ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



ఎల్కతుర్తి : మండలంలోని కేశవాపూర్ అనుబంధ గ్రామమైన రామకృష్ణాపూర్‌ను ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించినందుకు కాంగ్రెస్ నాయకులు బుధవారం సంబురాలు చేసుకున్నారు. అనంతరం సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మురళీధర్ జన్మదినం

శాయంపేట : మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు 61వ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ వినుకొండ శంకరాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు సామల రవీందర్, చింతల భాస్కర్, మారేపల్లి రాజేందర్, మాడిశెట్టి చిరంజీవి, ఎండీ సాదిక్, ప్రభాకర్, స్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

‘ధర్మసమాజ్ ప్లీనరీకి తరలిరావాలి’



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐనవోలు : రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలో నవంబర్ 3న నిర్వహించతలపెట్టిన తెలంగాణ రాష్ట్ర ధర్మసమాజ్ పార్టీ మొదటి ప్లీనరీ, కార్యకర్తల మహాసమ్మేళనానికి తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తూరు ప్రవీణ్ పిలుపునిచ్చారు. బుధవారం అందుకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ సమ్మేళనానికి బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజేందర్, అనిల్, నాగరాజు, ప్రవీణ్, గణేశ్, ప్రణయ్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం



పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన సంఘం జనరల్ మేనేజర్ రాంరెడ్డి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కాటన్ జిన్నింగ్ మిల్లు ఆవరణలో పత్తి కొనుగోళ్లను సంఘం జనరల్ మేనేజర్ యం.రాంరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకుచ్చే పత్తిలో తేమశాతం 8నుంచి 12 వరకు ఉండాలన్నారు. వరంగల్ మార్కెట్ ధరకు లోబడి నగదు, సభ్యులకు అప్పుకింద ఖరీదు చేయబడుతుందని తెలిపారు. మొదటిరోజు వరంగల్ మార్కెట్ ధర రూ.7,020 ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సంఘం ఉపాధ్యక్షుడు కడారి ఆదామ్, పాలకవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల పోరుబాట

నయీంనగర్: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇక పోరాటమే శరణ్యమని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ప్రకటించారు. ఆదర్శకాలనీ కమ్యూనిటీ హాల్‌లో నయీంనగర్ యూనిట్ పెన్షనర్ల సమావేశం సంఘం అధ్యక్షుడు సముద్రాల రామాచారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాట కార్యక్రమాలకు సంఘం పిలుపునిచ్చిందని వివరించారు. మొదటి దశలో నవంబర్ 5, 6వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎస్‌టీఓ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన, రెండో దశలో కలెక్టరేట్ల ఎదుట ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16 డిమాండ్లతో కూడిన పోరాట కార్యక్రమ నోటీసును ప్రభుత్వానికి రాష్ట్ర సంఘం ఇచ్చిందని గుర్తుచేశారు. బాధ్యులు నరసింహస్వామి, పరికిపండ్ల వేణు, యాదగిరి, టి.నిర్మల, అశోక్, కోటిలింగం, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి, రజాక్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నయీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని సామాజికవేత్త అరుణ్‌కుమార్, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. లష్కర్‌బజార్ యూఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అనేక పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్ మీదే ఆధారపడి నడుస్తూ వేలాది మంది అధ్యాపకులకు జీవనాధారంగా ఉన్నాయని వివరించారు. నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని వాపోయారు. అనేక కళాశాలలు సేవా దృక్పథంతో పనిచేస్తున్నాయని, కార్పొరేట్ విద్యాసంస్థల లాగా ఫీజులు వసూలు చేయడం లేదని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఐనవోలు : ఇసుక రవాణా చేసే మార్గాల్లో ట్రెంచ్ కటింగ్ చేయిస్తున్న అధికారులు

ఐనవోలు : మండలంలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్సై పస్తం శ్రీనివాస్, మైనింగ్ ఆర్ఐ చంద్రకళ అన్నారు. బుధవారం మండలంలోని లింగమోరిగూడెం, కక్కిరాలపల్లి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ రవాణా చేసే మార్గాల్లో ట్రెంచ్ వేశారు. అదే విధంగా 9 ట్రాక్టర్లు, 2 ఇసుక కడిగూ ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

టిప్పర్లు పట్టివేత

దామెర : మొరం అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు దామెర ఎస్సై కొంక అశోక్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ల్యాదెళ్ల నుంచి హనుమకొండకు మొరంలోడ్‌తో రెండు టిప్పర్లు వెళ్తున్నాయి. కాగా పెట్రోల్‌బంక్ సమీపంలో పోలీసులు తనఖీలు చేయగా అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో టీఎస్ 24 టీఏ 1520, టీఎస్ 24 టీఏ 2223 నంబర్‌గల టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

ఆత్మకూరు : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మానసిక వైద్య నిపుణుడు ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మనోవ్యాధి, మానసిక రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఒత్తిడికి గురైతే టెలిమానస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 14416కు ఫోన్ చేయాలని అన్నారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన, ప్రిన్సిపాల్ బి.ఎస్.రెడ్డి, వైద్య సిబ్బంది జునైదీ, సంపత్, సునీత, ఉమ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై కళాప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

పరకాల : తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు కళాబృందం ద్వారా స్థానిక బస్టాండ్ ఆవరణలో హెచ్ఐవీ, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. కళారంజని సందీప్ కళాబృందం చేపట్టిన ప్రదర్శన ప్రయాణికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మారి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సదానందం మాట్లాడుతూ.. హెచ్ఐవీ అంటువ్యాధి కాదన్నారు. కానీ అసురక్షితమైన లైంగిక సంబంధం, కలుషితమైన సూదులు, సిరంజీలు, కలుషితమైన రక్త మార్పిడి, తల్లి హెచ్ఐవీ వ్యాధి గ్రస్తురాలైతే ఆమెకు పుట్టబోయే బిడ్డకు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. యువతీ, యువకులు హెచ్ఐవీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాకారులు సందీప్, అర్జున్, చిరంజీవి, ఆర్టీసీ బస్టాండ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగి కుటుంబానికి వైద్య ఖర్చుల చెల్లింపు

హన్మకొండ: రోగి కుటుంబానికి అయిన వైద్య ఖర్చులను ఆర్టీసీ అధికారులు తిరిగి ఆ కుటుంబానికి ఇప్పించారు. ఆర్టీసీ వరంగల్ -2 డిపోకు చెందిన ఉద్యోగి నీరటి సమ్మయ్య అనారోగ్యానికి గురై రోహిణి ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ నీరటి సమ్మయ్య మృతి చెందాడు. కాగా, చికిత్సకు రూ.43 వేలు బిల్లు కాగా వారి కుటుంబ సభ్యులు రోహిణి ఆస్పత్రికి చెల్లించారు. ఆస్పత్రికి ఆర్టీసీ యాజమాన్యం వైద్య ఖర్చులు చెల్లిస్తుంది. ఈ క్రమంలో రోగి కుటుంబం చెల్లించిన బిల్లు మొత్తాన్ని రోహిణి యాజమాన్యం నుంచి చెక్కు రూపేణా వసూలు చేసి ఆ చెక్కును హనుమకొండలోని ఆర్ఎం కార్యాలయంలో ఈడీ పీవీ.మునిశేఖర్ చేతుల మీదుగా నీరటి నర్సయ్య కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భానుకిరణ్, జి.మాధవ రావు, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్, డిపో మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.